# నీలవేణి...

## ఓ అందమైన పరీక్షనాళిక

- పి.వి.సునీల్ కుమార్

**ర**మణ మోటార్‌సైకిల్ ఆశీలు మెట్టదాటి ఎకనామిక్సు బిల్డింగ్ పక్క మెయిన్ రోడ్డులోంచి మువ్వలవానిపాలెం కాలనీవైపు దూసుకు పోతోంది.

రాత్రి పది గంటలు దాటింది. చల్లటి గాలి రివ్వున కొడుతోంది. బీచ్ పొడుగూ సముద్రం ఎగిరిపడుతున్న అలల చప్పుడు వినపడుతోంది.

ఇంత రాత్రిపూట రమ్మందేంటి నీలవేణి అనుకున్నాడు రమణ. అతడో జర్నలిస్టు. ఆడాళ్ళ పేజీలో ఇంటరెస్టింగ్ స్టోరీ రావాలని ఎడిటర్ చంపుకు తింటుంటే పడలేక ఆడాళ్ళ మీద దృష్టి పెట్టాడు.

''ఏదైనా కొత్తగా చెయ్యవయ్యా'' అంటూ చెత్తగా ఎడిటరాసురుడు ఇచ్చిన హెచ్చరికతో క్రికెట్ ఆడే ఆడవాళ్ళు, ఏంకర్లు, బ్యూటీ పార్లర్ల వాళ్ళు పరిధిలో లేకుండా పోయారు. అన్నిటినీ రొటీన్ అంటాడు ఎడిటర్.

చివరికి కోళ్ళఫారం నడుపుతున్న అమ్మాయి కథనైనా రొటీనే అంటాడు.

భార్య కాన్పుకు వెళ్ళడంతో భోజనం కోసం మెస్‌మీద ఆధారపడక తప్పలేదు రమణకి.

ఎమ్వీపీ కాలనీలో నీలవేణి మెస్ చాలా ఫేమస్. నీలవేణి మెస్ ఇక్కడ భోజనం చాలా హాట్‌గురూ అనుకుంటారు. భోజనమే కాదు ఆ మెస్ నడిపే నీలవేణి కూడా చాలా అందగత్తే. నీలవేణి భోజనాన్ని తిని ఆకలి తీర్చుకున్నవాళ్ళు తక్కువా, ఆమెని చూసి లొట్టలేసే వాళ్ళు ఎక్కువా ఆ సిటీలో.

నలభై దాటినా వయసుని జయించింది ఆమె శరీరం. మంచి పొడవూ, లావూ సన్నమూ కానీ శరీరం, ముఖ్యంగా ఆమె మొహంలో కన్పించే దర్పం, కమాండ్ ఆమెని చాలా ఆకర్షణీయంగా చేశాయి.

ఆమె మెస్‌కో ప్రత్యేకత ఉంది. తెల్లటి అన్నం, అదిరిపోయే పప్పు, ఓ వేపుడుకూర, సాంబారు, వేడి రసం, అప్పడం, గడ్డ పెరుగు దాంట్లోకి ఆవకాయ లేదా గోంగూర పచ్చడితో అమృత సమానమైన భోజనం కేవలం మనుషుల్లా తినే వాళ్ళకే పెడుతుంది.

బకాసురుల్లా మింగే వాళ్ళకి రేపట్నుంచి రావద్దని చెప్తుంది. రైట్ ఆఫ్ ఎడ్మిషన్ రిజర్వ్‌డ్.

***

ఏంటో ఈ మనిషి అర్థమే కాదు అనుకున్నాడు రమణ.

'మీ మెస్‌కి పబ్లిసిటీ వస్తుంది. ఇంటర్వ్యూ ఇవ్వండి' అని ఎంత అడిగినా ఇవ్వని మనిషి, ''మీ జీవితంలో ఈ తరం అమ్మాయిలకి పనికి వచ్చేది ఏదైనా ఉంటుందేమో చూడండి'' అంటే ''సర్లేండి, నన్ను ఆలోచించుకోనివ్వండి'' అని ఓ రోజు తర్వాత.

''నా కథ చెప్తా'' అన్నది.

నీలవేణి ఇంటర్వ్యూకి పిలిచింది. అది కూడా రాత్రి పూట అనేసరికి రమణ ఆఫీసులో బ్రేకింగ్ న్యూస్ అయింది.

''ఇట్ కాల్స్‌ఫరే సెలబ్రేషన్'' అంది ఇంగ్లీష్ ఎడిషన్‌లో పనిచేసే పిల్ల.

''ఉండూ.... రమణకి టీట్వంటీ జట్టులో ప్లేసొచ్చింది కానీ మనాడికి బాటింగ్ ఛాన్సు వస్తుందో లేక డకౌట్‌కే పరిమితమవుతాడో'' అన్నాడు స్పోర్ట్స్ డస్కు.

''సిగ్గులేదురా చచ్చినాళ్ళారా... మేల్‌చావనిస్టు క్రిమినిల్స్ అంతా కటకట్టుకు పత్రికాఫీసులో చేరినట్టుంది. ఆ నీలవేణి చాలా షార్ట్ టెంపరు, మనాడ్ని గరిటతో నాలుగు బాది సాంబారు డేగిషాలో ముంచి రేపు వడ్డిస్తుంది'' అంటూ శాపనార్థాలు పెట్టింది ఫెమినిస్టు శ్యామల.

ఈ లేట్ ఈవెనింగ్ ఇంటర్వ్యూ రమణకి వర్కవుటవుతుందనీ, కాదనీ అప్పటికప్పుడు స్పాట్ బెట్టింగ్‌లు మొదలయ్యాయి.

***

''నా గురించి తెలుసుకునే ముందు సంపత్ గురించి తెలుసుకోవాలి మీరు'' అంది నీలవేణి.

''అతనెవరు?'' అని అడిగాడు రమణ.

''అతని గురించే చెప్పబోతోంటే అతనెవరు అని అడగడం అర్థం లేని పని'' అని నీలవేణి అన్లేదు, ఆమె చిరునవ్వు అంది.

''సంపత్ గురించి ఆ ఊళ్ళో తెలీని వాళ్ళు లేరు. డాక్టర్ జెకిల్ అండ్ మిస్టర్ హైడ్ లాంటి కారెక్టర్ అతనిది. తాగకపోతే అతనంత మంచివాడు లేడు. చాలా సాధు స్వభావి. సాయంత్రం ఏడు గంటలు దాటిందంటే పాత బస్టాండు దగ్గర ఉన్న వైన్‌షాపులో తాగడం మొదలెడతాడు.

సంపత్ ఇల్లు ఊరికి ఈ చివర ఉండే తాలూకా ఆఫీసు దగ్గర. మరి ఆ చివర్నించి తాగటం ఎందుకు మొదలెడతాడో ఇంతవరకూ ఎవరికీ తెలీదు. నైన్టీ ఎమ్మెల్‌తో మొదలెట్టి, తిరుమలా టాకీస్ రోడ్డు కళ్ళే మూల మీద ఉన్న ఎగ్‌బజ్జీ దుకాణంలో బజ్జీతో మొదలెట్టి, ఊళ్ళో ఉన్న బెల్టు షాపుల వెంట నడుచుకుంటూ, నైన్టీ చొప్పున పుచ్చుకుంటూ రాత్రి ఒంటిగంట వరకూ తాగుతూనే ఉంటాడు.

ఆ కిక్కులో రోడ్న పోయేవాళ్ళతో గొడవలు, సంపత్ గురించి తెల్సిన వాళ్లైయితే 'ఛీ' అనుకుని పోవడమో, తెలీని వాళ్లయితే పట్టుకు తన్నడమూ జరుగుతాయి.

తినాల్సినవి (తన్నుల్తో సహా) తిని, తాగాల్సినంత తాగి ఇంటికి చేరి ఓ అరగంట తల్లినీ తండ్రినీ నానా తిట్లూ తిట్టి, ఒక్కోసారి కొట్టి పడుకుంటాడు.

హైస్కూల్లో చదివే రోజుల్లో సంపత్ టెన్త్ క్లాసులో జిల్లా ఫస్టు వచ్చాడు. మనూర్నించి ఐపియస్ అయ్యేవాడు వీడొక్కడే అనుకున్నారు ఊళ్ళో వాళ్ళు. కానీ వాడు కాస్తా డిగ్రీ కొచ్చేసరికి పరమ తాగుబోతుగా ఎలా మారేడో, ఎందుకు మారేడో ఎవరికీ తెలీదు. కానీ సంపత్ డిగ్రీ కూడా పూర్తి చేయలేదనేది వాస్తవం.

సంపత్ తండ్రి నారాయణరావు ఊళ్ళో మంచి పేరున్న ఎరువుల వ్యాపారి.

కొడుకుచేసే పనులకి తలదించుకుని బాధపడటం తప్ప ఏమీ చెయ్యలేక పోతున్నాడు. సంపత్‌కి ఓ చెల్లెలుంది. ఆ అమ్మాయి అంటే చాలా ప్రేమ సంపత్‌కి.

''ఎందుకురా తాగుతావు... ఆరోగ్యం చూడు ఎలా పాడయిందో... మానెయ్యరాదూ'' అంటుందా పిల్ల.


బదులుగా ఏడుస్తాడు తప్ప, ఏమీ చెప్పడు సంపత్.

సంపత్ గురించిన వార్త చింతలపూడి గ్రామాన్ని స్తంభింప చేసింది.

''ఇది వన్డే ఇంటర్నేషనల్'' అన్నాడు ఆనందబాబు అనబడే బుజ్జి తన హీరో హోండా సారాలక్ష్మి బెల్టుషాపులో రెండు పెగ్గులు తాగాక.

''కాదన్నా ఇది టీ ట్వంటీ'' అన్నాడు రాజేంద్ర.

''పెద్దవాడిని కదా... ఆలోచించే మాట్లాడు



తున్నా'' అన్నాడు బుజ్జి.

''ఇంతకీ సంపత్ సృష్టించబోతున్న ఆ సంచలనం...?''

''బ్రేక్ తర్వాత'' అని నాటకీయంగా అంది నీలవేణి.

***

''రమణగారూ.... టీ చల్లారిపోతుంది... తాగండి'' అంది నీలవేణి.

ఆమె నారేషన్ బావుండటంతో ఆలోచనల్లో కొట్టుకుపోతున్న రమణ తెప్పరిల్లి టీ అందుకున్నాడు.

'ఇక మా గొడవకొస్తే... మా అమ్మ సావిత్రి పేరుకు తగ్గట్టే సిన్మా సావిత్రిలా సౌమ్యురాలు. మాకో నాన్న అతడు ఉన్నాడో లేడో తెలీని బాపతు'.

తండ్రి అనేవాడు పూర్తిగా ఉంటే ఒక రకం, లేకపోతే ఒక రకం... ఉండిలేకపోతే నరకం. అదే మా అమ్మకయితే భర్త అనేవాడు ఉండీ లేని నరకం. నాన్నవల్ల వచ్చిన నానా నరకం.

మా నాన్న ఏసీటివోగా చేసే వాడు. జీతం కన్నం గీతం ఎక్కువ. నాకో చెల్లెలు, తమ్ముడు. మేము పుట్టాక మా నాన్నకీ తన వయసులో సగం వయసుండే ఓ అమ్మాయితో సంబంధం ఏర్పడింది. మా అమ్మని వదిలేసి ఎక్కువగా ఆ అమ్మాయితోనే ఉండేవాడు.

సంవత్సరానికి రెండు మూడుసార్లు వచ్చేవాడు. సాయిబులకి పండగలొచ్చినంత తరచుగా. ఆయన వచ్చినప్పుడు మా అమ్మ భయం, అంతకంటే ఎక్కువ భక్తితో అతడికి సేవలు చేసేది.

మమ్మల్ని ఎంతో ప్రేమగా చూసే అమ్మ, ఆ మూడ్నాలుగు రోజులు మమ్మల్ని మర్చిపోయి అతడికి సేవ చేసేది. ఆయన కూడా మాతో ఏమంత ప్రేమగా ఉండేవాడు కాదు. అధికారం చెలాయించేవాడు. గంభీరంగా ఉండేవాడు.

తాను చేస్తున్న పని పట్ల సిగ్గుతో అతను అలా ఉన్నాడని మాకెప్పుడు అన్పించలేదు.

తుఫాను వెలిసినట్లు అతను వెళ్ళిపోయేవాడు. చీకట్లు, మబ్బులు తొలగి ఆకాశం వెలిగినట్టు మా మనసులు వెలిగేవి. అలా అని మాకు కష్టాలు లేవని కాదు.

ఆర్థికంగా ఎంతో ఇబ్బందిపడ్డాం. అమ్మకి పొలం నుండి రావాల్సిన డబ్బు కౌలుదార్లు సరిగ్గా ఇచ్చేవాళ్ళు కాదు. తాను ప్రైవేటు స్కూళ్ళలో టీచర్‌గా పని చేసేది.

కొన్ని చోట్ల పర్లేదు కానీ, ఒక్కో స్కూల్లో ఒక్కో కామపిశాచి తగిలేది. అంతే అయితేవాడు స్కూలు వదిలిపెట్టాలి లేదా మా అమ్మ స్కూలు మానేయాలి. అంతలా వెంటాడి వేధించేవాళ్ళు.

ఇది బయటకు చెప్పుకుని, తిరగబడే సాహసం మా అమ్మకి లేదు. నిశ్శబ్దంగా అక్కడినుంచి మానేసి మరోచోట చేరేది.

క్రమంగా మాకు అర్థం కావటం మొదలైంది. అమ్మ స్కూల్ మారిందంటే ఎందుకో. రక్తం మరిగిపోయేది. కానీ ఏమీ చేయలేని అశక్తత. నాకైతే ఏమైనా కానీ ఆ మృగాళ్ళని పొడిచి పారేద్దాం అనిపించేది.

ఎప్పుడేనా ఓదార్చాబోతే... ''ఏం కాలేదురా ఇంటికి దూరమని మారిపోయా'' అనేది. లేకపోతే ''జీతం పెంచరని మారానని చెప్పేది''.

పక్కింట్లో ఉండే ''అన్నయ్య గారు'' ఓ సారి చెయ్యి పట్టుకున్నప్పుడు నిగ్రహించుకోలేక ఏడ్చేసింది.

మా తమ్ముడు అప్పుడు పద్నాలుగో ఏట ఉన్నాడు. నాకు పద్దెనిమిది.... వాడు ముందు నడిచాడు పదక్కా వాడి సంగతి చూద్దాం అని.

ఇద్దరం వెళ్ళి అమ్మ ''అన్నయ్యగార్ని'' వాళ్ళ ఆవిడ ముందే చితక్కొట్టాం. చాలా సంతోషం వేసింది.

అన్నయ్య గారు ఇల్లు మారిపోయాడు. కానీ అమ్మ భయపడింది. ఇంకా ఇలాంటి గొడవలు ఎన్ని చూడాలో అని అందరూ ఏమనుకుంటారో అనీ...

ఇలా పడుతూ లేస్తున్న మా జీవితాల్లోకి నాన్న మళ్ళీ వచ్చాడు.

ఈసారి శాశ్వతంగా... ఎందుకంటే నాన్నని ఉంచుకున్నావిడ ఈయన్ని వదిలేసింది.

ఆయన ఏసీబీ కేసులో ఉద్యోగం పోగొట్టుకోవటంతో

''మా నాన్న ఎప్పుడో ఓసారి వచ్చి పోతుండటం వల్ల సమాజం మమ్మల్ని చిన్నచూపు చూసింది. ఫ్రెండ్స్ ఇళ్ళలో బర్త్‌డే పార్టీలకీ, ఫంక్షన్లకీ అందరూ పిలిచేవాళ్ళు కాదు. కొంతమంది చాలామంది చాలా మంచి వాళ్ళు. అనవసరమైన డిస్కషన్లు, సైకో ఫాన్సీ లేకుండా ఉండే వాళ్ళు. కొందరు మాత్రం మమ్మల్ని వాళ్ళతో కలవనివ్వడం వల్ల వాళ్ళు గురజాడ అప్పారావు, రాజారామ్మోహన్ రాయల్ స్థాయిలో ఉద్ధరిస్తున్నామని ఫీలయ్యేవాళ్ళు''.

ఒక్కోసారి అన్పించేది పొలం కౌలు రాకపోవడం, అమ్మ వేపు ఏమైనా అవకాశం ఉంటుందా అన్నట్టు చూడ్డం ఇవన్నీ ఓ మగజీవి ఇంట్లో లేకపోవటం వల్లే కదా అని.

కానీ, ఆ వెల్తి వల్లే అనుకుంటూ మా చెల్లెలో తమ్ముడు నేనూ అమ్మ ఎంతో ప్రేమగా ఉండేవాళ్ళు. ఒకరికోసం ఒకరు ఏం చెయ్యడానికైనా సిద్ధపడే ప్రేమ అది.

''మా నాన్న తిరిగి వచ్చాడే కానీ ఇంట్లో ఎవరో ఫారినర్ అంటే అమెరికా నుండి తెల్లవాడో, నైజీరియా నుంచి నల్లవాడో మన జాతికి సంబంధం

లేని వాడు వచ్చి ఉంటున్నట్టు ఉండేది''.

''సంతోషంగా ఉండే కుటుంబాలన్నీ ఒక్కలానే సంతోషంగా ఉంటాయి. దుఃఖంతో ఉన్న కుటుంబాలు మాత్రం దేని పద్ధతిలో అవి దుఃఖంగా ఉంటాయి అంటాడు టాల్‌స్టాయ్ అన్నా కార్నికోవాలో. మా కుటుంబం విషయంలో అతడు తప్పు. ఎంత బాధ ఉన్నా మా దారిన మేం సంతోషంగానే ఉన్నాం. ఈయన వల్ల ఆ సంతోషం పోయింది''.

''టాల్‌స్టాయ్ అన్నట్టుగానే ఓ హోటల్‌లోనో, రైల్వే ఫ్లాట్‌ఫాం మీదో యాదృచ్ఛికంగా కలిసిన వాళ్లకు కామన్‌గా ఉండే విషయాలు ఎక్కువ ఉంటాయి. మా నాన్నకీ మాకూ ఉన్న రిలేషన్‌తో పోలిస్తే?

చాలా ఇబ్బందిగా మా మధ్య గోడ కట్టినట్టుగా, ఇంట్లో కలరా జబ్బు తిరుగుతున్నంతగా ఇబ్బందిగా ఉండేది.

ఎప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ ప్రేమగా మాట్లాడుకునే మేం ఫార్మల్‌గా మాట్లాడుకోవటం మొదలైంది''.

చెప్పటం ఆపి నీళ్ళు తాగి ఓ గ్లాసు రమణకి ఇచ్చింది నీలవేణి.

''అలవాటు లేని ఆ పోసనపడితే మూతి మీసాలు కాలాయని ఎప్పుడైనా విన్నారా'' అంది.

బిత్తరపోయిన రమణ ''విన్నాను కానీ మీ కథకీ ఆ పోసనకీ సంబంధం ఏమిటో అర్థం కావటం లేదు'' అన్నాడు.

''మా నాన్నకి మమ్మల్ని కని పారేయటమే తెలుసు తప్ప మా ఆలనా పాలనా ఎప్పుడూ చూడ్డం తెలీదు. ఆయనకి తన సుఖమే ముఖ్యం. ఓ మేల్ షావనిస్టుపిగ్. అయితే అలాంటివాడు అకస్మాత్తుగా ఓ మంచి తండ్రి అయిపోవాలనుకున్నాడు, బిన్‌లాడెన్ నోబుల్ శాంతి బహుమతి ఆశించినట్టు''.

ఆయనకి చిన్నతనం నుండీ ఓ ఫ్రెండు వాళ్ళ ఊళ్ళో ఉన్నాడు. ఇద్దరూ సావాసగాళ్ళు సినిమాలో సత్యనారాయణ, గుమ్మడి అనుకున్నట్టు నీకు కొడుకూ, నాకు కూతురు పుడితే వాళ్ళకి పెళ్ళి చేద్దాం అనుకున్నారట. అది ఈయనికి గుర్తొచ్చింది.

ఆ ఫ్రెండుని వెతుక్కుంటూ వెళ్లాడు. ఆయన ఆర్థికంగా బాగా ఉన్నాడు. వాళ్లబ్బాయి కూడా వ్యాపారంలో ఆయనకి తోడుగా ఉంటూ ప్రయోజకుడయ్యాడు. వాళ్ళ ఇల్లూ గొడ్డూ గోదా చూసి ముచ్చటపడి సంబంధం ఖాయం చేసుకున్నాడు.

భళ్ళున పెళ్లయింది. మా నాన్న ఓ మంచి తండ్రీ, మంచి స్నేహితుడూ అయ్యాడు. నా జీవితమే నాశనం అయింది.

ఎన్నో ఆశల్తో మొదటి రాత్రి గదిలోకి వెళ్ళాను. వాడి నుండి గుప్పుమని మందూ ఇంకా గుట్కా కలిపిన కంపు గడుపు తిప్పి కడుపు రాకుండానే వాంతి అయింది.

వాడిపేరు సంపత్. ఆనందబాబు అన్నట్టు మా పెళ్ళి వన్డే ఇంటర్నేషనల్‌గా ఒక్క రోజులో ముగిసింది.


స్నేహితుడు మోసం చేశాడన్న బెంగతో, కూతురి జీవితం బలిచేశానన్న బాధతో మా నాన్న చనిపోయాడు.

కానీ ఆయన అంటించిన సంపత్‌ని నా జీవితం నుంచి వెళ్ళగొట్టడానికి దాదాపు స్వైన్ ఫ్లూ నుండి బయటపడినంత పనయింది.

''మా అబ్బాయి బంగారం.. వాడ్ని జాగ్రత్తగా చూసుకుంటే వాడంత మంచివాడు లేడు'' అన్నారు మామగారు అత్తగారు.

''మా అన్నయ్యకి ఈ పెళ్ళి ఇష్టం లేదు. కానీ నేను ఎంతో చెప్పి ఒప్పించాను. మా అన్న కొంచెం పాడయన మాట వాస్తవమే కానీ పెళ్ళితో అన్న బాగుపడతాడు అనుకున్నా'' అంది అతని చెల్లి.

నా జీవితం ఓ పరీక్ష నాళిక అయిపోయింది రమణగారు.



మా అమ్మ మంచి భార్యగా భర్త చెప్పిన సంబంధానికి ఒప్పుకుందే కానీ, తన జీవితంలా కూతురి జీవితం కూడా నాశనం కాకుండా ఏ జాగ్రత్త తీసుకోలేదు. నాన్న సరేసరి మంచి స్నేహితుడూ, తండ్రీ అయిపోవాలని నా జీవితంతో ఆడుకున్నారు.

సాటి స్త్రీలయి కూడా పూర్తిగా చెడిపోయి ఇంకో రెండేళ్ళ కంటే బతకని సంపత్‌ని నాపై ప్రయోగించి చూశారు మా అత్తగారూ, ఆడపడుచూ. వాళ్ళు ఓ మంచి తల్లీ చెల్లెలూ అయిపోయారు.

మన జీవితం మీద మనకి కంట్రోల్ లేకపోతే ఇలా ప్రతి కుక్కా మన జీవితంతో ప్రయోగాలు చేస్తాయి. అందుకే ఓ వయసూ, ఇంగితమూ వచ్చాక మన మంచి చెడూ ఏదో మనమే చూసుకోవాలి. దానికోసం తల్లితండ్రులని ఎదిరించాల్సి వచ్చినా సరే.

ఇది చెప్పడానికే నా కథ మీకు చెప్పాల్సి వచ్చింది. నాలాంటి వాళ్ళెవరైనా ఈ కథ చదివి వాళ్ళ నిర్ణయం వాళ్ళు తీసుకోగలిగితే చాలు రమణగారూ'' అంది నీలవేణి.

''ఈమెస్ ఆర్థికంగా నన్ను నిలబెట్టింది. నా తమ్ముడు, చెల్లి పెళ్ళిళ్లు చేసుకున్నారు. ఆర్థికంగా నిలబడ్డారు. మా అమ్మ హాయిగా ఉంది'' అంటూ ముగించింది నీలవేణి.

అది సరే మీ కథ స్ట్రెయిట్‌గా చెప్పకుండా సంపత్ కథ ముందు ఎందుకు చెప్పారు?'' అడిగాడు రమణ.

''మీ ఎడిటర్ మంచి స్టోరీ ఇమ్మన్నాడు రమణగారు రీడబిలిటీ ఉండాలంటే ఎలిమెంట్ ఆఫ్ సస్పెన్స్ ఉండాలి. తాగుబోతులూ, దెయ్యాలూ, పాతకుడ్ని ఆకర్షిస్తాయి. వాట్ని ఉపయోగించి కథ చెప్తే నాలాంటి డ్రై జీవితం కూడా బావుంటుంది'' అంది నీలవేణి.

''అయ్యబాబోయ్, మీరు మంచి రచయిత్రి అయిపోయే వాళ్ళు ప్రయత్నిస్తే'' అన్నాడు రమణ.

''నా కథ చెప్పాలంటే... ఏడేళ్ల చిన్నపాప నేనూ బర్త్‌డేకి వెళ్తానని ఏడుస్తుంది కానీ ఆ పాపని సముదాయించలేక, ఆ పార్టీకి తామెందుకూ వెళ్ళలేమో చెప్పలేక ఆ తల్లి హృదయం తల్లడిల్లిపోయింది అని కూడా మొదలెట్టవచ్చు'' అంది నీలవేణి.

''మరి అలా ఎందుకు మొదలవలేదు?'' అన్నాడు రమణ.

''ఎందుకంటే ఈ రచయితకి క్రైమూ, థ్రిల్లరూ, హ్యూమరు రాయటం అలవాటయిపోయి నా జీవితాన్ని కూడా అలానే ప్రజెంట్ చేయడం వల్ల'' అని నవ్వింది నీలవేణి.

*

రచయిత సెల్ నెం: ***94944 42349***

**http://thesunilonline.blogspot.com**